జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 17-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 250 పేజీలు: 4 వెల : రూ.7



* వత్సవలసకు తరలివచ్చిన భక్తజనం * మొక్కుబడులు చెల్లింపులు * ఎక్కడికక్కడ నిలిచిన ట్రాఫిక్ * కిటకిటలాడిన సముద్ర తీరాలు

# రాజమ్మా... దీవించమ్మా

**గార/శ్రీకాకుళం, ఫిబ్రవరి 16 (వార్త):** ఏటా మాఘ, పాల్గుణ మాసాల్లో ఆదివారం గార మండలంలోని వత్సవలసలో రాజమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమవుతాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శనివారం రాత్రి పెద్ద ఎత్తున వత్సవలస చేరుకున్నారు. రాత్రి అక్కడ బస చేసి.. వేకువజామునే సముద్ర స్నానాలు ఆచరించారు. అనంతరం మైలపిల్లి పేరయ్య దాసుడు రాజమ్మ సన్నిదానం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు రాజమ్మకు పూజలు చేసి మొక్కుబడులు చెల్లించారు. భక్తుల రద్దీ దృష్ట్యా డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో గార ఎస్ఐ ఆర్.జనార్దన్‌తోపాటు 240 మంది పోలీసు బందోబస్తు నిర్వహించారు. బీచ్ వద్ద మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పోటెత్తిన అరసవల్లి, శ్రీకూర్మం..

వత్సవలస జాతరకు వచ్చిన భక్తులతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆదివారం అరసవల్లి, శ్రీకూర్మం తరలివచ్చారు. దీంతో ఆలయాల్లోని క్యూలైన్లు కిటకిటలాడాయి. ఎండలు మండుతున్నా స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉచిత, రూ.100 క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. గంటల కొద్దీ భక్తులు లైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో పలువురు భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండలకు తాళలేకపోతున్నామని, క్యూలైన్లలో కనీసం టెంట్లు వేయాలని భక్తులు ఆలయాధికారులను కోరుతున్నారు.

## పీడీఎస్ బియ్యం తరలింపుపై..
# ఆర్డీవో విచారణ

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 16 (వార్త):** రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. శనివారం రాత్రి మర్రిపాడు సమీపంలో వ్యాన్‌తో తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని స్థానిక యువకులు పట్టుకున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా సంబంధిత సిబ్బంది పట్టించుకోలేదు. దీనిపై 'జాతీయ వార్త'లో రెవెన్యూ, పోలీసు కనుసన్నల్లో పీడీఎస్ బియ్యం తరలింపు కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి స్పందించారు. అక్రమంగా తరలిపోతున్న బియ్యంపై విచారణ చేయాలని సంతబొమ్మాళి రెవెన్యూ సిబ్బందికి, కోటబొమ్మాళి సీఎస్‌డీటీ రామచంద్రకు ఆదేశాలు జారీ చేశారు.

## రెవెన్యూ కనుసన్నల్లోనే..
# పీడీఎస్ బియ్యం తరలింపు



* మర్రిపాడు వద్ద 40 బస్తాల బియ్యం పట్టుకున్న యువకులు * రెవెన్యూ, పోలీసులకు సమాచారం * కనీసం పట్టించుకోని అధికారులు * ఎవరూ రాకపోవడంతో దర్జాగా వెళ్లిపోయిన వ్యాన్ డ్రైవర్ * రెవెన్యూ, పోలీసు సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 15 (వార్త):** సంతబొమ్మాళి మండలంలోని మర్రిపాడు వద్ద అక్రమంగా పీడీఎఫ్ బియ్యం తరలిపోతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. కోటబొమ్మాళికి చెందిన ఒక వ్యాపారస్తుడు తన వ్యానులో పీడీఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలించగా మర్రిపాడు వద్ద కొందరు యువకులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. సుమారు 40 బస్తాలు పిడిఎఫ్ బియ్యం వ్యానులో ఉంది. ఈ విషయాన్ని ఆర్ఐ ప్రసన్న, వీఆర్వో ఉమాపతికి, పోలీసులకు చెప్పిన పట్టించుకోలేదు. సుమారు గంటకు పైగా పిడిఎఫ్ బియ్యాన్ని అడ్డుకున్నా అధికారులు ఎవరు రాకపోవడంతో వ్యాన్ లో దర్జాగా వెళ్లిపోయారు. దీంతో రెవెన్యూ అధికారుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వార కనుసన్నల్లోనే ఈ దందా సాగుతోందని, అందుకే రాలేదని పలువురు వాపోయారు.



## ఎర్రన్న స్మృతివనాన్ని
# సుందరంగా తీర్చిదిద్దుదాం

* కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు * నిమ్మాడలో ఘాట్ పరిశీలన

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఫిబ్రవరి 16 (వార్త):** దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు స్మృతివనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులు నిర్ణయించారు. కింజరాపు కుటుంబం స్వగ్రామం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో గల ఎర్రన్నాయుడు ఘాట్ ను మంత్రులతో పాటు ప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ప్రత్యేక అధికారి (ఓఎస్డీ) అయిన కింజరాపు ప్రభాకర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఘాట్‌ను సందర్శించారు. ఘాట్ వద్ద రానున్న జయంతి నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. వారి వెంట టీడీపీ నేతలు వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర, యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసు నాయుడు, ఫ్లెక్సీ చిన్ని, టెక్కలి నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

## దివ్యాంగ బాలికపై శునకాల దాడి



**పొందూరు, ఫిబ్రవరి 16(వార్త):** పొందూరు మండలం అలబోయినపేట గ్రామానికి చెందిన శెనగల శ్యామల తోటివారితో కలిసి శనివారం రాపాక గ్రామంలోని వివాహ భోజనాలకు వెళ్లింది. భోజనం ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో గ్రామానికి సమీపంలో ఆరు శునకాలు ఒక్కసారిగా ఆమెపై దాడికి పాల్పడ్డాయి. వినికిడిలోపం ఉన్న బాలికకు శునకాలు అరుపులు వినపడలేదు. తోటివారు తెలిపేందుకు ప్రయత్నించినా ఆమె గ్రహించలేకపోయింది. ఒంటరిగా ఉన్న శ్యామలపై శునకాలు ఒక్కసారిగా దాడిజరిపి గాయపరిచాయి. ఇది సమీపంలో ఉన్నవారు గ్రహించి శునకాలను తరిమేశారు. అప్పటికే బాలిక రెండుకాళ్లపై తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## ఈ-శ్రామ్ దరఖాస్తులకు ఆహ్వానం

**పలాస, ఫిబ్రవరి 16(వార్త):** అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ-శ్రామ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు వెల్లడించారు. వ్యవసాయ రంగ కార్మికులు, ఆశా వర్కర్లు, వలస కార్మికులు, ఇళ్ళలో, దుకాణాలలో పనిచేయు కార్మికులు, కొరియర్ బాయ్స్, తోపుడు బండి వర్తకులు, మత్స్య కార్మికులు, పాల వ్యాపారాలు, చేతివృత్తులు వారు, భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు, ఎన్ఆర్ఈజీఎస్ కార్మికులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు వయస్సు 16 నుండి 59 సంవత్సరాలల వయసు గలవారు ఈ పథకానికి అర్హులని చెప్పారు. అర్హులైన వారు ఈ పథకం ఆన్లైన్ చేసుకొనుటకు దగ్గర్లో ఉన్న సచివాలయం, మెప్మా ఆర్పిల వద్దకు వెళ్లి నమోదు చేసుకోవచ్చుని వెల్లడించారు.

# వాసుదేవుని బ్రహ్మోత్సవాలకు వేళాయే

* ముస్తాబైన మందస
* భారీగా పోలీసుల బందోబస్తు
* మందస చేరుకుంటున్న భక్తులు





**మందస, ఫిబ్రవరి 16(వార్త):** బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమయినది. మందస పట్టణంలోని వెలసిన శ్రీవాసుదేవ పెరుమాళ్ళస్వామి బ్రహ్మోత్సవాల వివరాలను వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకుడు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు వివరించారు. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామి, త్రిదండి అహోబిలరామానుజ జీయర్స్వామి, త్రిదండి దేవనాథరామానుజ జీయర్స్వామిల పర్యవేక్షణలో 16వ బ్రహ్మోత్సవ వేడుకలు 7రోజుల పాటు మందసలో జరుగనున్నాయి. ఈ నెల 17వ తేదీన ప్రారంభమయి 23వ తేదీతో ముగుస్తాయి. ఇప్పటికే ఆలయం ముస్తాబు కాగా.. స్వామి వాహనాలు, పాత్రలను ఆండాళ్ల గోష్ఠి శుభ్రపరిచింది. ఆదివారం కావడంతో చిన్నారులు కూడా ఉడతాభక్తి స్వామి సేవలో పాల్గొన్నారు. కాగా, శ్రీవాసుదేవుని అర్చకులు దివ్యాలంకృతుని కావించి, భక్తులకు దర్శనం కల్పించారు.

### కార్యక్రమాల వివరాలివే: గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, , ప్రధాన అర్చకులు




ప్రతీరోజూ ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ద్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేషహోమములు, పంచసూక్త, పరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుమురై, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, ప్రసాదగోష్ఠి కార్యక్రమాలుంటాయి. అదేవిధంగా ప్రతీరోజూ విశేష కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు, సంకీర్తనలు, కోలాటాలు కార్యక్రమాలు జరుగుతాయి. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ జరుగుతుంది. 17న ఆంజనేయస్వామి అభిషేకం, 18న శ్రీవాసుదేవ పెరుమాళ్ అభిషేకం, శ్రీవిశ్వక్సేన ఆరాధన, అంకురారోపణం, 19న గరుడపూజ, ధ్వజారోహణం, హనుమద్వాహనం, శేషవాహనం, 20న కల్పవృక్ష వాహనం, ఎదుర్కోలు ఉత్సవం, 21న శ్రీవాసుదేవ పెరుమాళ్ కల్యాణమహోత్సవం, గరుడవాహనం, 22న పొన్నచెట్టు వాహనం, తెప్పోత్సవం, అశ్వవాహనం, 23న రథోత్సవం, చక్రస్నానం, ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

### 100 మందితో భారీ బందోబస్తు



వాసుదేవుని బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 100 మంది పోలీసులను నియమిస్తున్నాం. కాశీబుగ్గరూరల్ సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఉంటుంది. ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి భక్తులు సహకరించాలి. అమ్మాయిలను వేధించడం, వెకిలి వేషాలు చేయడం చేస్తే చర్యలు తీసుకుంటాం. నిరంతరం నిఘా ఉంటుంది. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

**- కె.కృష్ణప్రసాద్, ఎస్ఐ, మందస.**



## ఆదిత్యుని సన్నిధిలో గాయని సునీత

**అరసవల్లి, ఫిబ్రవరి 16 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామిని ప్రముఖ గాయకురాలు సునీత ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తారు. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ. 8,15000, పూజలు, విరాళాల రూపంలో రూ. 1,08,740, ప్రసాదాల రూపంలో రూ. 2,22,670 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ గారు తెలిపారు.

# బాబోయ్.. మందస

* స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు
* పూర్తి కాని రహదారి నిర్మాణం పనులు
* ప్రజల్లో చైతన్యం వస్తే మంచిదంటున్న అధికారులు

**మందస, ఫిబ్రవరి 16(వార్త):** రాజులు హయాంలో వెలుగొందిన మంజూష(మందస) కష్టాలు తప్పడంలేదు. అభివృద్ధిపై పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడంతో అభివృద్ధి పనులు అరకొరగానే మిగిలిపోతున్నాయి. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఏదో ఒక ప్రభుత్వం వస్తుంటే.. ఆయా ప్రభుత్వాలు చేస్తున్న పనులు ప్రభుత్వాలకు చివరి రోజులు అవుతుండడంతో.. వారు చేస్తున్న పనులు అర్థాంతరంగా నిలిచిపోతున్నాయి. దీంతో జిల్లాలోనే మేజరు పంచాయతీల్లో ఒకటిగా గుర్తింపు పొందిన మందస నేటికీ వెనుకబడిన పంచాయతీగానే మిగిలిపోయింది. టీడీపీ, కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల హయాంలలో చేపట్టిన పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. ప్రస్తుతం మందస పట్టణంలో రహదారులు కొంతమేర బాగుపడినప్పటికీ, కొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఫుట్పాత్ నిర్మాణం నేటి వరకు పూర్తికాలేదు. ప్రజల్లో చైతన్యంలేకపోవడంతో సెంటర్ డివైడర్లలో చెత్తా, చెదారం వేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించడంలేదు. డ్రైనేజి వ్యవస్థ కూడా అస్తవ్యస్థంగా ఉంది. డేంజర్ జోన్లను గుర్తించి, హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ, అమలు కావడంలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్తవీధిలో రాత్రివేళ కుక్కల భయం ఉంది. ద్విచక్రవాహనదారులను వెంబడిస్తుంటాయి. సెంటర్ లైటింగ్ సరిగా పని చేయడంలేదు. అభివృద్ధి పనులు ఐటీడీఏ శాఖ ఆధ్వర్యంలో జరుగగా.. మందస అభివృద్ధి కమిటీ నాయకులు ఈఈ, డీఈఈ, ఏఈలను కలిసి సమస్యలను వివరించినప్పటికీ స్పందించేనాథుడే కరవ-య్యాడు. సర్పంచ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాగా, అధికారంలో టీడీపీ ఉండడంతో రెండింటికీ చెడ్డ రేవడిలా మందస పరిస్థితి మారింది. ఇప్పటికైనా



ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, మందస సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



మందసలో గత ప్రభుత్వం లో ఐటీడీఏ నిధులతో గవర్నమెంట్ కాలేజీ జంక్షన్ నుండి పెట్రోల్ బంక్ వరకు వేసిన రోడ్ ఇప్పటికీ కూడా పూర్తి కాలేదు. ముఖ్యంగా అసంపూర్ణంగా వేయించిన స్ట్రీట్ లైట్, అస్సలు మొదలు పెట్టని ఫుట్ పాత్, సగం వేసిన డ్రైనేజీ, అస్తవ్యస్తంగా నిర్మించిన డివైడర్లు, ప్రమాద స్థలాలలో స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ప్రతిరోజూ ఒకటో, రెండో రోడ్డు ఆక్సిడెంట్ లు జరుగుతూనే ఉన్నాయి. అధికారులకి చలనం లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. పలుమార్లు దీనిపై ఐటీడీఏ డిపార్ట్మెంట్ ఫిర్యాదు చేసినా, మౌనంగానే ఉన్నారు. ప్రమాదాలు అరికట్టడానికి అవసరైన స్థానంలో స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డులు యుద్ధ ప్రాతిదికన వేయించాలని ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత అధికారులకు కోరుతున్నాము.

**- శ్రీనివాస్ పాఢి, సోషల్ వర్కర్, కార్యకర్త, మందస**



### విజయ గౌరీని గెలిపించాలని
## యూటీఎఫ్ విస్తృత ప్రచారం

**సోంపేట, ఫిబ్రవరి 16 (వార్త):** ఉపాధ్యాయ వ్యవస్థలో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అపరిష్కృత సమస్యలు పరిష్కారం కోసం అలుపెరుగకుండా పనిచేసే వ్యక్తి ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె విజయగౌరీ అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు అన్నారు. సోంపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎర్రముక్కాం, రాజాం, తాళ్లబద్ర, కొర్లాం, జెపి కొత్తూరు, మామిడిపల్లి, శాసనాం, కర్తలిపాలేం, పొత్రఖండ, బారువ, బేసి రామ చంద్రాపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గౌరకల దొరబాబు, జిల్లా కౌన్సిలర్ రవికుమార్, గండుపల్లి, గోపాల్, గౌరకల నాగేశ్వరరావు, గౌరకల శ్రీనివాస్రావు, గెంజి జేజేశ్వరరావు, పెద్దింటి, రమేష్, మూల శాంతి, కుమార్, రిటైర్డ్ హెచ్ఎం అంబటి కృష్ణ మూర్తి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో డ్రోన్ నిఘా



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి16 (వార్త):** నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. ఆదివారం శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డచ్ బంగ్లా, కంపోస్టు కోలని, వాంబే కోలని, అరసవల్లి, దమ్మలవీధి, కిల్లిపాలెం, నాగావళి పొన్నాడ వంతెన తదితర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పెట్టారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరణ



**టెక్కలి, ఫిబ్రవరి 16 (వార్త):** కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వీకరించారు. తక్షణం ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయా శాఖల అధికారులకు మంత్రి ఆదేశించారు.

## ఉపనిషమందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

**శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 16 (వార్త):** ఉపనిషన్ మందిరంలో డాక్టర్ పులఖండం శ్రీనివాసరావుచే ఆదివారం సర్వశక్తి సమన్వితపై ప్రవచనాలు ఇచ్చారు. పురాణాల్లోని అంశాలు నేటి తరా నికి వర్తిస్తాయని, మంచి చెడు హింస అహింస సత్ప్రవర్తన దుష్ప్ర వర్తన అనేదానిపై మానవ జీవితం ఆధారపడి ఉంటుందని ఉద్బో దించారు. ఇలాంటివి ఎన్ని తరాలు అయిన మార్పు రాలేదని, చెడు పై మంచి విజయం పొందడం అవసరంగా వివరించారు. అప్పుడే లోకం సమతుల్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రభాకరరావు, డా. మందుల మహన రావు, విశ్వేశ్వరరావు. రంగుడు ప్రసాదరావు, పెద్ది ఈశ్వరరావు, మల్లేశ్వర రావు.. ఉమారాని, లక్ష్మి సరస్వతి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఐటీబీపీ జవాన్ శశి కుమార్ మృతి

**పలాస, ఫిబ్రవరి 16 (వార్త):** బొడ్డపాడు గ్రామానికి చెందిన ఐటిబిపి జవాన్ దాసరి శశి కుమార్ మృతి చెందాడు. ఈ సందర్భంగా బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షులు కిక్కిరి డిలేశ్వరావు మాట్లాడుతూ మనలో ఒకడిగా ఉన్న దాసరి శశికుమార్ దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. అందరితో కలివిడిగా ఉండే శశికుమార్ అకస్మికంగా మరణించడం అత్యంత దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.





## నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

**హిరమండలం, ఫిబ్రవరి 16 (వార్త):** గత మూడు,నాలుగు రోజుల నుంచి తాగునీరు లేకపోవడంతో హిరమండలం మేజర్ పంచాయతీ గ్రామస్తులు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో చిన్నకోరాడ వీధితో పాటు పలువీధుల్లో రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా జరుగుతున్న తాగునీరు గత మూడు,నాలుగు రోజుల నుంచి నిలిచి పోయింది. దీంతో మహిళలు, గ్రామస్తులు అలికాం – బత్తిలి ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు రావటం లేదన్నారు. సంబంధిత అధికారుల వద్ద సమస్యను ప్రస్తావించినా పట్టించుకోవడం లేదన్నారు. రహదారిపై నిరసనలు తెలియజేయటంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.స్థానికులు చొరవ తీసుకుని మహిళల నిరసనలను విరమించారు.

## గృహహింస కేసు నమోదు

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 16 (వార్త):** నౌపడ పంచాయితీ కూర్మనాథపురం గ్రామానికి చెందిన పరపటి సుమలత ఫిర్యాదు మేరకు గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై నారాయణస్వామి ఆదివారం తెలిపారు. భర్త పరపటి విద్యా సాగర్ నిత్యం దాడి చేస్తున్నాడని ఫిర్యాదులో భార్య సుమలత ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి విద్యా సాగర్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

## పోలింగ్ శతశాతం నమోదు కావాలి

### ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్



**పొందూరు, ఫిబ్రవరి 16 (వార్త):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో శతశాతం పోలింగ్ చరిగేలా చర్యలుతీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని తోలాపి గ్రామంలోని స్వర్గీయ గురుగుబెల్లి గడ్డిన్నాయ్య మాస్టార్ స్వగృహంలో ఆదివారం ఏపీటీఎఫ్ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సే ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా చేపట్టాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి నేతాజీ, జిల్లా కార్యదర్శి పప్పల తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్‌కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు మొగదాల రమణారావు, పొన్నాడ తేజేశ్వరరావు, మండల శాఖ ఉపాధ్యక్షుడు గరుగుబెల్లి శ్రీనివాసరావు,కార్యవర్గ సభ్యుడు కల్లూరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కింతలి, కనిమెట్ట, తోలాపి గ్రామాల్లో ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, ఏపీటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'కాపు నిరుద్యోగులను ఆదుకుంటాం'

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 16(వార్త):** సమాజంలో అట్టడుగు వర్గాల వారిని ఆదుకు నేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకురావాలని జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం. రామ జోగినాయుడు అన్నారు. కానిస్టే బుల్ పరీక్షలకు హాజరవుతున్న పేదింటి కాపు బిడ్డలు ఎవరైనా ఉంటే వారికి శ్రీకాకుళంలో భోజనం, వసతి కల్పిస్తామని ఉచితంగా మెటీరియల్స్ అందిస్తామని ఆదివారం ప్రకటించారు. మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి కాపు బిడ్డలకు శిక్షణకు మెటీరియల్‌కు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాపుబిడ్డలు ఉద్యోగాలు పొందాలనేదే ప్రధాన అజెండాతోనే భవన నిర్మాణ చేపట్టేందుకు అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. 2025 చివరి నాటికి భవన నిర్మాణం జరిగితే ఉద్యోగ శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ప్రతినిధు లు కిల్లారీ నారాయణరావు, పడాల తమ్మునాయుడు, పతివాడ సురేష్, కురిట్ దుర్గారావు, అంకాడాల తవిటన్న, వాళ్ళ శ్రీరాములు నాయుడు, దన్నాన మోహన్‌రావు, లావేటి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# థర్మల్ పవర్ ప్లాంట్‌తో పచ్చని పొలాలు నాశనం

### మానవ హక్కుల వేదిక కన్వీనర్ కృష్ణ




**ఆమదాలవలస, ఫిబ్రవరి 16 (వార్త):** థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే పచ్చగా ప్రాంతం బీడుగా మారుతుందని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్.కృష్ణ చెప్పారు. థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాలు అయినటువంటి వెన్నెలవలస, మసానపుట్టి, బొడ్లపాడు, తిమడాం, జంగాలపాడు గ్రామాల్లో థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం పచ్చటి పంట భూములతో రెండు పంటలు పండుతున్నాయని, దీనికి తోడుగా ఆదివాసి ప్రాంతమని, ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఈ ప్రాంతం భూగర్భజలాలు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానవాళి మనుగడకు థర్మల్ పవర్ ప్లాంట్ ముప్పు ఉందని గుర్తించిన ప్రపంచ దేశాలు 2050 నాటికి మూసివేయాలని ఒప్పందం కుదుర్చుకున్నాయని గుర్తు చేశారు. కార్బన్ ఉద్గారాలు తగ్గించాలని ప్రపంచమంతా తీర్మానం చేస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ తీసుకొస్తామని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని వి.ఎస్. కృష్ణ అన్నారు. కార్బన్డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి విషతుల్య కార్బన్ ఉదార్గాలను వెదజల్లే థర్మల్ ప్లాంట్ వల్ల అభివృద్ధి జరుగుతుందని ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. పవర్ ప్లాంట్ ఏర్పాటుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రీన్ ట్రిబునల్ వారు అనుమతులు ఎలా ఇస్తారని నిలదీశారు. ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాబోయే ప్రమాదాన్ని ముందుగా అడ్డుకోవాలని భావితరాల భవిష్యత్తు కాపాడుకోవాలంటే ఈ ప్రాంతంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రయత్నాలు పాలకులు విరమించుకోవాలని ఆయన హితవు పలికారు. విరమించుకునే ప్రకటన వచ్చేంతవరకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజల తరపున పోరాటానికి మానవ హక్కుల వేదిక ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. జగన్నాథం వేదిక నాయకులు అనురాధ, వేదిక కార్యదర్శి సురేష్, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, కార్యదర్శి రవికాంత్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల సంఘం ఆత్మీయ సమ్మేళనం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16 (వార్త):** జిల్లా కేంద్రంలోని సంక్షేమ సంఘం కార్యాల యం వద్ద ఆదివారం ఉత్తరాంధ్ర మాజీ సైనిక సంక్షేమ సంఘాల నాయకులు సమా వేశం జిల్లా ఫెడరేషన్ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ అడహక్ కమిటీ కన్వీనర్ కె. గోవిందరావు, నాయకులు సాంబశివరావు, సూరెడ్డి శివ కుమార్ పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా మాజీ సైనికులు చేస్తున్న సేవా కార్యక్రమాలు, అందిస్తున్న సంక్షేమ కార్య క్రమాల గురించి వివరించారు. కె.గోవిం దరావు, తాండ్ర సాంబశివరావు, శివకుమార్ లు మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమానికి వన్ స్టేట్ వన్ అసోసియేషన్ కృషి చేస్తుంద న్నారు. ప్రతి మాజీ సైనికుడికి, వారి కుటుంబ సభ్యులకు సంఘం అండగా ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర నలుమూలల నుంచి మాజీ సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మెమో 57ను వర్తింపజేయండి

- * పాత పెన్షన్ విధానమే మేలు
- * డిమాండ్ పరిష్కరించకుంటే దశలవారీగా పోరాటం
- * ఫోరం రాష్ట్ర కన్వీనర్ శివశంకర్




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16 (వార్త):** నగరంలోని శాంతినగర్ కాలనీలో గల కళింగభవన్లో డీఎస్సీ 2003 ఉత్తరాంధ్ర ఫోరం ఆధ్వర్యంలో మెమో 57 ఉద్యోగ ఉపాధ్యాయ సాధన సమితి సమావేశం జిల్లా కన్వీనర్ కొత్తకోట.శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ మోపిదేవి శివశంకర్ మాట్లాడుతూ 2003 డిఎస్సీ నోటిఫికేషన్ 2003 నవంబర్ 13 న విడుదలైనప్పటికీ నియామకాలు 2005 నవంబర్లో చేపట్టి రెండు సంవత్సరాలు ఆలస్యం చేసి బలవంతంగా సిపిఎస్ విధానంలోకి నెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2003 డీఎస్సీ ద్వారా నియమించబడిన విద్యాశాఖకు చెందిన 7361 మంది ఉపాధ్యాయులకు అలాగే హెూం శాఖ కు చెందిన 1800 మంది కానిస్టేబుల్స్‌కు, అలాగే గ్రూప్ 2 గ్రూప్, 2 గ్రూప్ 1హెల్త్ డిపార్ట్మెంట్స్ చెందిన 1800 మందికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వర్తింప చేసి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. భవిష్యత్తులో మెమో 57 అమలు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయకపోతే దశలు వారి పోరాటం చేస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షులు హనుమాన్ సాయిరాం మాట్లాడుతూ ఇది ఆర్థిక భారమైన డిమాండ్ కాదన్నారు. ప్రభుత్వం మెమో 57 ప్రాప్తికి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని దానికి అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు దుప్పల శివరాం ప్రసాద్ మాట్లాడుతూ 57 ప్రాప్తికి 15 రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమలు చేశాయని, మన రాష్ట్రంలో కూడా అమలు చేసి 16 వ రాష్ట్రంగా చేరాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోరం జిల్లా కన్వీనర్ పి.శ్రీహరి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సుబ్బారెడ్డి, విజయనగరం కన్వీనర్ రవి, వైజాగ్ కన్వీనర్ షేక్ మహ్మద్, ఎమ్మెల్సీ కంటెస్టింగ్ క్యాండిడేట్స్ గాదె శ్రీనివాసులు నాయుడు, కోరేడ్ల విజయ్ గౌరి, ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల భానుమూర్తి, ఏ పి టి ఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, శిష్ట అనిల్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్, గొంటి గిరిధర్, చౌదరి రవీంద్ర, పి ఆర్ టి యు నాయకులు పప్పల రాజశేఖర్, దానేటి కేశవ్, ఎస్ఎల్టిఏ నాయకులు అప్పన్న, బొడ్డేపల్లి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీకాకుళానికి ఇరిగేషన్ సర్కిల్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16 (వార్త):** శ్రీకాకుళానికి ఇరిగేషన్ సర్కిల్ రావడం రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని జిల్లా రైతాంగం హర్షం వ్యక్తం చేశారు. రైతాంగని సంబంధించిన ఏ పనైనా బొబ్బిలి వెళ్లవలస వచ్చేదని, ఆ సమస్య ఇప్పుడు లేకుండా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కృషి ఎంత ఉందని, వీరిద్దరి వల్ల జిల్లా రైతాంగానికి సిబ్బందికి ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఇరిగేషన్ సర్కిల్ శ్రీకాకుళం తీసుకొచ్చేందుకు 2016లో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి చేసినప్పటికీ, వైయస్సార్ పార్టీ అధికారంలో మరుగును పడేశారని, కూటమి ప్రభుత్వంలో సర్కిల్ ఏర్పాటుకు ప్రయత్నం జరిగిందన్నారు.

# క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

- శ్రీకాకుళం టూ టౌన్ సీఐ ఈశ్వరరావు
- కోడిరామ్మూర్తి స్టేడియంలో భాష్యం స్పోర్ట్స్‌మీట్
- విద్యార్థులను ఉత్తేజపర్చిన సీఐ











**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 16 (వార్త):** విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, అత్యున్నత స్థానం పొందేందుకు దోహదపడతాయని శ్రీకాకుళం టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో భాష్యం లిటిల్ చాంప్స్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే అత్యున్న స్థాయికి ఎదిగే ఆస్కారం ఉంటుందని చెప్పారు. విద్యను అభ్యసించడం ఎంత అవసరమో క్రీడల్లో ప్రతిభ కనబర్చడం అంతే ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తిరిగి ఇంటికి చేరుతున్న సమయాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. దీనివల్ల ఎటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లో విద్యార్థులు పడకుండా కాపాడుకునే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం భాష్యం ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ ఈ జిల్లాలో విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యం ఇచ్చే తల్లిదండ్రులు ఎక్కువని ప్రశంసించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన క్రీడాకారులు శ్రీకాకుళం జిల్లా వాసులు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. తమ విద్యా సంస్థల్లోని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యాసన చేస్తారని, దేశ వ్యాప్తంగా జరిగిన పరీక్షల్లోనూ తమ విద్యార్థులు సత్తాచాటి ఈ రాష్ట్రానికి పేరు తేవడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత హెచ్ఆర్ రాకేష్‌రోయ్, వైస్‌ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులకు క్రీడాభ్యాసనాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ముందుగా క్రీడా, వ్యాయామ, కరాటే విభాగం ఉపాధ్యాయులు తమ్మినాన కిరణ్‌కుమార్, రమణ, గౌరీ శంకర్, హేమసుందర్ క్రీడాజ్యోతితో స్టేడియంలో టార్చ్‌బేరర్ చేశారు. కార్యక్రమంలో పీఈటీ నీలమణి, అకాడమిక్ ఇన్‌చార్జిలు లత, రేవతి, ఉదయరాణి, జీఈఓ శివన్నారాయణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## సైనికుల యూనియన్ భవనం ప్రారంభం

**నరసన్నపేట, ఫిబ్రవరి 16 (వార్త):** స్థానిక సత్యవరం జంక్షన్‌లో మాజీ సైనికుల యూనియన్ భవనం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, పోలాకి ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, మాజీ సుడా చైర్మన్ గుప్తా, నరసన్నపేట వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ బాబ్జి, స్థానిక వార్డు సభ్యులు తమదాన బాల తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతికి పూజలు

**శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 16 (వార్త):** సంకటహర చతుర్థి సందర్భంగా నగరంలో గణపతి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పాలాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు,, హెూమ పూజలు నిర్వహించారు.. అదేవిధంగా పాలకొండ రోడ్‌లో ఉన్న విజయ గణపతి ఆలయంలో, రైతు బజార్లో ఉన్న వినాయకుడి ఆలయంలో, పంచముకేశ్వర వినాయక ఆలయంలో, నక్క వీధిలో ఉన్న ఉమా జట్లేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# గ్రామీణ వైద్యుల సేవలు నిరుపమానం

*ప్రాథమిక చికిత్స అందించడంలో కీలక పాత్ర *సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జోష్



**ఆమదాలవలస, ఫిబ్రవరి 16 (వార్త):** గ్రామీణ ప్రజలకు ప్రాథమిక స్థాయిలో వైద్య సేవలు అందించటంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ సేవలు నిరుపమానమని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోష్ అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్లో జిల్లా సామాజిక గ్రామీణ సంక్షేమ వైద్యుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జోష్ మాట్లాడుతూ రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్.ఎం.పి)లు గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో జాగ్రత్త వహించాలన్నారు. ప్రాథమిక వైద్యం అందించడంలో ముఖ్య భూమిక పోషి స్తున్నారన్నారు. ఆర్ఎంపీలు వ్యాధి గుర్తించి వైద్యం అందించగలిగితే సకాలంలో నయం చేయగలుగుతారని చెప్పారు. గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని పలువురు గ్రామీణ వైద్యులు కోరారు. సంఘ పటిష్టతకు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. సమావేశంలో యూరాలజిస్ట్ బుడుమూరు రమణమూర్తి, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ గురుగుబెల్లి సంధ్య గ్రామీణ వైద్య సంఘం నాయకులు జోనల్ గౌరవ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు ఉపాధ్యక్షుడు అల్లాడ త్రినాధ రావు, జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. ఉమామహేశ్వరరావు ఉపాధ్యక్షుడు పి.రాజులు జిల్లా సమన్వయకర్త చౌదరి శ్రీనివాసరావు వైద్య సంఘం నాయకుడు ఎంఢ విశ్వనాథం చింతాడ శ్రీనివాసరావు ఆమదాలవలస మండల వైద్య సంఘం అధ్యక్షుడు గురుగుబెల్లి రాజు, గ్రామీణ వైద్యులు దానేటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546